## క్లుప్తంగా

### డ్రైనేజీ పైపులైన్ నిర్మించండి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మక్దూం పటేల్

**పహాడీషరీఫ్:** పహాడీషరీఫ్ రాజీవ్‌గాంధీనగర్‌లో స్థానిక ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ పైపులైన్ మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపల్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు మహ్మద్ మక్దూం పటేల్ కోరారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల క్రితం ఏర్పడిన రాజీవ్‌గాంధీనగర్‌లో డ్రైనేజీ పైపులైన్ లేకపోవంతో స్థానికులు రింగ్‌లు వేసుకోవాల్సి వస్తోందన్నారు. మురుగునీరు వెళ్లేందుకు కూడా కచ్చా మోరీలు నిర్మించాలని కోరారు. పైపులైన్ వేయించేలా చూస్తానని ఆమె హామీ ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహ్మద్ నయీం, సయ్యద్ యూసుఫ్, జహంగీర్‌ఖాన్, ఫెరోజ్, రహీం, ఇమ్రాన్ పటేల్, అమీర్ పటేల్, అర్బాజ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

### ఎమ్మార్పీఎస్ దెబ్బడగూడ గ్రామ కమిటీ ఎన్నిక

**కందుకూరు:** మండల పరిధిలోని దెబ్బడగూడలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్న కమిటీని బుధవారం ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రావిచెట్టు వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా మల్లేపల్లి బాల్‌రాజ్, మల్లేపల్లి రాజులతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేపల్లి ప్రభుదాస్, మల్లేపల్లి ప్రభాకర్, మల్లేపల్లి సామయ్య, మల్లేపల్లి బాలరాజ్, పడకంటి నర్సింహ, గూడుం శ్రీను, వంకా శ్రీను, రావిచెట్టు శ్రీను, రవీందర్, రాజేందర్, భరత, శరత్, జోసెఫ్, రమేశ్ పాల్గొన్నారు.

### చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీపీఓ తదితరులు

**కందుకూరు:** మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీఓ శాంతిశ్రీ కోరారు. బుధవారం మండల పరిధి మీర్‌ఖాన్‌పేటలో అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. నూతనంగా చేరిన చిన్నారులకు స్వాగతం పలికి, అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీలో చదువు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. డయేరియా ప్రబల కుండా జాగ్రత్తలు వహించాలని, ఈగలు, దోమల పెరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి, తల్లులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఇక్కడ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రీస్కూల్ ద్వారా పిల్లల్లో శారీరక, మేధో, మానసిక, భాష, పూర్వ లిఖిత, పూర్వ పఠన అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి, అందులో ఆకుకూరలు, కూరగాయ విత్తనాలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సబిత, టీచర్లు,కమిటీ సభ్యులు, తల్లులు పాల్గొన్నారు.

### ప్రధాన రోడ్డుకు మరమ్మతులు



నాదర్‌గుల్ ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న కమిషనర్ సరస్వతి

**బడంగ్‌పేట్:** 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 17వ రోజు బుధవారం ప్రధాన, లింక్ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. కమిషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో నాదర్‌గుల్ నుంచి గాంధీనగర్ వరకు ప్రధాన రహదారికి మరమ్మతులు చేశారు. బడంగ్‌పేటలోని కోటమైసమ్మ వద్ద, సర్కిల్ వద్ద, ప్యాచ్ వర్కులు చేయించారు. ప్యాచ్ వర్కులు పూర్తి కాగానే బీటీరోడ్డు వేస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏఎంసీ శ్యామ్‌సుందర్, మేనేజర్ నాగేశ్వర్ రావు, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు ఉన్నారు.

# మహేశ్వరం రైతులకు మొండిచేయి

- మండల పరిధి అన్నదాతలకు అందని భరోసా
- అర్హులందరికీ పెట్టుబడి ఇవ్వాలి
- పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

**మహేశ్వరం:** 'రాష్ట్రంలోని అన్ని మండలాల రైతులకు ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వారివారి ఖాతాల్లో జమ చేస్తుంది. కానీ మహేశ్వరం మండల రైతులకు ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా వేయలేదు' అని మహేశ్వరం పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అర్హులైన రైతులందరికీ వెంటనే సాగుసాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలు, తుక్కుగూడ మున్సిపాలిటీలోని 4 మేజర్ గ్రామాల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 13,470 మంది రైతులకు 19,817 ఎకరాల భూమి ఉందని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏటా రెండు దఫాలుగా రైతుబంధును వారి ఖాతాల్లో వేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపిస్తుందని విమర్శించారు.

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉందనే..**

ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉందనే అక్కసుతో ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తుందని గులాబీ శ్రేణులు పేర్కొన్నారు. రెండు రోజుల వ్యవధిలో రైతుల ఖాతాల్లో సాగుసాయం డబ్బులు జమచేయకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సైదులుకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మండల అధ్యక్షుడు రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆనందం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్య యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జాన్‌రెడ్డి, శివగంగ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని దివాలా తీయించిన బీఆర్‌ఎస్

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి

**కందుకూరు:** మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీకే చెందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం, అవినీతి, అనాలోచిత అహంకార దోపిడీ నిర్ణయాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందేగాక, కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. పేయిడ్ ఆర్టిస్టులతో ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడిస్తూ కుట్రలకు తెరలేపుతున్నారన్నారు. మరోపక్క ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట మేరకు రైతు భరోసా నిధులను విడుదల చేయడం సంతోషించదగిన పరిణామమన్నారు. రైతుల మేలు కోరే ప్రభుత్వం ఒక్క కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు. రాష్ట్రంలో సాగులో ఉన్న 1.49 కోట్ల ఎకరాలకు రైతు భరోసా నిధులను ప్రజా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**హుడాకాంప్లెక్స్:** సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గణేష్‌పురి, నర్సింహపురి, వీగార్డ్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ హనుమాన్‌నగర్, శివాలయం, యాదవనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు.

### మొక్కలు నాటి.. సంరక్షించాలి



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థులు

**ఆమనగల్లు:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందులో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య కోరారు. బుధవారం తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములయ్య,లక్ష్మణ్, శ్రీనివాస్‌లు, చంద్రశేఖర్, ప్రభుదాస్, మనోజ్‌కుమార్, బాలమని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులు వేగంగా చేపట్టాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాదర్‌గుల్ వాసులు

**బడంగ్‌పేట్:** నాదర్‌గుల్ నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలని కోరుతూ బుధవారం మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాదర్‌గుల్ నుంచి గాంధీనగర్ వరకు ఉన్న ప్రధాన రోడ్డు అధ్వానంగా మారిందని ఆరోపించారు. బడ్జెట్‌లో నిధులు మంజూరైన పనులు జరగడం లేదని, పనులు చేపట్టేలా బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించాలని వినతిప్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బంగారు అశోక్, శేఖర్, శంకర్, నాగరాజ్, రజినీకాంత్, మురళీశ్రీను తదితరులు ఉన్నారు.

### మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

**చైతన్యపురి:** శాంతిభద్రతలు కాపాడేందుకు నిత్యం వాహనతనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం సరూర్‌నగర్ మండల కార్యాలయం, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేశారు. త్రిబుల్ రైడింగ్, నంబర్‌ప్లేట్ సరిగాలేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విజిబుల్ పోలీస్‌లో భాగంగా వాహనాలు తనిఖీలు చేయటంతో గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టవచ్చన్నారు.

# ఐఎన్‌టీయూసీ జల్‌పల్లి అధ్యక్షుడిగా నవీన్‌గౌడ్



నవీన్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న కేఎల్లార్, నాయకులు

**పహాడీషరీఫ్:** ఐఎన్‌టీయూసీ జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా చింతకింది నవీన్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు సన్నబియ్యం లాంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్మిక, కర్షకులకు కూడా ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. మున్సిపాలిటీలో కార్మికులకు ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు కేఎల్లార్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జి నడికుడ శివ, జల్‌పల్లి నాయకుడు జహంగీర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులతో ఆస్మా అంజుమ్

**చంపాపేట:** నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చంపాపేట ప్రభుత్వ యునానీ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆస్మా అంజుమ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ పేరిట డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆస్మా అంజుమ్ మాట్లాడుతూ.. గత నెల 27 నుంచి హరిత యోగా, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, మహిళలు, యువకులకు యోగా ప్రయోజనాలు తెలిపారు. యోగాతో మానసిక ఆందోళనలు, దీర్ఘకాలిక రోగాలు దూరమవుతాయన్నారు. అనంతరం రక్తహీనత కలిగిన విద్యార్థులు తీసుకోవాల్సిన న్యూట్రిషన్ ఫుడ్, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ భీమయ్య, సరిత, యునానీ ఫార్మాసిస్ట్ హేమరాణీ పాల్గొన్నారు.

**నేడు శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో..**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెట్ లెక్కల కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్ శాండిల్య

**సైదాబాద్:** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ సహకరించాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీఎస్ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య కోరారు. బుధవారం సైదాబాద్‌లోని జువైనల్ హోం బాలలకు మాదక ద్రవ్యాలకు నో చెప్పండి అనే సందేశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తలెత్తే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ అభిషేక్ మహంతి, టీఎస్ న్యాబ్ అధికారి చెన్నూరి రూపేష్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, జువైనల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్ పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

**వనస్థలిపురం:** డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని యశోదనగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, రవిందర్‌గౌడ్, రఘురాం, రామకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, లింగంగౌడ్, విఠలేశం, వెంకటేష్, చంద్రమోహన్ రెడ్డి, రాములు, ప్రకాష్‌రావు, కొండల్‌రెడ్డి, సత్యనాయక్, శేఖర్ పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- తహసీల్దార్ సైదులు



మహేశ్వరంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సైదులు

**మహేశ్వరం:** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లో భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. దీని ద్వారా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల పరిధిలోని ఘట్టుపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మహేశ్వరంలో 128 దరఖాస్తులు, ఘట్టుపల్లిలో 78 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, డిప్యూటీ తహసీల్దార్ నవత, సీనియర్ అసిస్టెంట్ పావని, ఆర్ఐలు స్వర్ణకుమారి, ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

**కందుకూరు:** ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న నిరుపేదలకు ఓ వరంలాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్ అన్నారు. మండల పరిధి నేదునూరుకు చెందిన బుడ్డీరవు శ్రీనివాస్‌కు రూ.45 వేలు, ఎల్మటి నిర్మలకు రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంత, కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, మాజీ ఉప సర్పంచ్ జి.ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు యాదయ్య, యుగంధర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, రాకేష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండునాయక్, ఎగిరిశెట్టి నరసింహ, శివశంకర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**చెక్కు అందజేత**

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీకి చెందిన ఆంజనేయులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం సీఎం సహాయ నిధికి మాజీ కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో దరఖాస్తు చేసుకున్నాడు. రూ.40వేలు మంజూరు కావడంతో ఇందుకు సంబంధించిన చెక్కు మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణతో పాటు మున్సిపాలిటీ నాయకులు షేక్ జహంగీరుద్దీన్, మన్నె రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

**మీర్‌పేట:** మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో నూతన భవనం సిద్ధంగా ఉన్నందున 8వ తరగతిని ప్రారంభించాలని, అదేవిధంగా పాఠశాలకు వాచ్‌మెన్‌ను నియమించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల లోపలి నుంచి కాలనీకు వెళ్లే రహదారిని పూర్తిగా మూసివేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే వెంట ఎంఈఓ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు జి.కాంతారావు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, జటావత్ శ్రీనునాయక్, అర్కల కామేశ్‌రెడ్డి, శిశుపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సునీతబాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఎమ్మెల్యేవి వెన్నుపోటు రాజకీయాలు

- మధుయాష్కిగౌడ్

**ఎల్‌బీనగర్:** ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డివి వెన్నుపోటు రాజకీయాలని, గత ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన 118 జీఓ ఉత్తదేనని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కిగౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని 118జీఓ బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రక్తంలోనే మోసం ఉందని, జీఓ 118 పేరిట ఇంకా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన తెచ్చిన జీఓ తప్పుడు తడకగా ఉందని, దీంతో ఇబ్బందులు ఉన్నాయని కాలనీ వాసులు పేర్కొంటుండగా ఇంకా అదే జీఓ 118 ద్వారా కన్వీనియన్స్ డీడ్‌లు ఇప్పిస్తానంటూ మోసం మాటలతో మాయ చేస్తున్నాడని విమర్శించారు. 2004 నుంచి హుడా చైర్మన్‌గా, 2009, 2018లో ఎమ్మెల్యేగా ఉన్నా ఎందుకు సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాలనీ సంఘాల నాయకులు దామోదర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వరెడ్డి, సుజాతనాయక్, నాయకులు గణేష్‌రెడ్డి, మకుటం సదాశివుడు, వినయ్‌పటేల్ పాల్గొన్నారు.

**త్వరలో వెకెట్‌ల్యాండ్ టాక్స్ తొలగింపు**

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు ఇళ్లకు విధిస్తున్న వెకెట్ ల్యాండ్ పన్నును వారం రోజుల్లో తొలగిస్తామని, ఇందుకు సంబంధిన ఉత్తర్వులను త్వరలోనే జారీ చేస్తామని గ్రేటర్ కమిషనర్ పేర్కొన్నారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. 118జీవో బాధితుల ఇళ్లతో పాటు వెకెట్‌ల్యాండ్ టాక్స్‌ను విధిస్తున్నారని పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయ కులు ఫిర్యాదు చేయడంతో బుధవారం గ్రేటర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను ఆయన మల్‌రెడ్డి రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు కలిసి విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

**హస్తినాపురం:** ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధి వివేకానందనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివేకానందనగర్‌కలానీలో డ్రైనేజీ, మంచినీరు, సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రతినిత్యం కాలనీలోని రోడ్లపై మురుగునీరు ఏరులై పారుతుందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలికవసతులు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి

**సైదాబాద్:** తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశ పెడుతున్న పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం యాకత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్‌లో డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షుడు నగారిగారి దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా వారి సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. కాంగ్రెస్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేసే నాయకులు, కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని అన్నారు. చాలా కాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు త్వరలోనే నామినేటెడ్, పార్టీ పదవులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రవిరాజు, లక్ష్మణ్, కోట్ల లడ్డూపటేల్, దేవి, సరోజ, వెంకటమ్మ, అలివేలు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.